## క్లుప్తంగా

### ఉపాధ్యాయులకు సత్కారం

బిక్కవోలు: పందలపాక గ్రామంలో శ్రీపడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఏడుగురు ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు, పీడీ యువరాజారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పంపన వీర సత్యనారాయణ పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికులకు కిట్ల అందజేత



కార్మికులకు కిట్లు అందిస్తున్న సర్పంచ్

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లిలో పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ బండారు రమ్య కిట్స్ అందించారు. బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద 14 మంది పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండటానికి కావలసిన సబ్బులు, ఆయిల్ వంటి తదితర కిట్స్‌ను వారికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమ్య, ఎంపీటీసీ బండారు శివ, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ తొండాపు సురేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అచ్చియచౌదరి తదితరులు పాల్గొన్నారు.

### నేడు మదుగులమ్మకు సారె సమర్పణ

బిక్కవోలు: స్థానిక మదుగులమ్మ ఆలయంలో అమ్మవారికి సారె సమర్పణ కార్యక్రమం గురువారం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు మహిళలు తమ శక్తి కొలది పసుపు, కుంకుమ, స్వీట్స్ తీసుకుని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయానికి చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి గ్రామోత్సవం నిర్వహించి, మదుగులమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకోవాలన్నారు. తర్వాత పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.


### సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఆన్‌లైన్ లావాదేవీలు పెరిగిన నేపథ్యంలో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అనపర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలియని ఫోన్ కాల్స్, వాట్సాప్ చాటింగ్, ఈ- మెయిల్ మెసేజీలలో వచ్చిన అపరిచిత లింకులను క్లిక్ చేయరాదన్నారు. అలా చేయడం వల్ల ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్, వ్యక్తిగత వివరాలు అపహరణకు గురయ్యే ప్రమాదముందన్నారు. బాగా పరిచయస్తులు పంపిన లింకులు కూడా నిర్ధారించుకోకుండా ఓపెన్ చేయరాదని, అలాగే బహిరంగంగా వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఏదైనా అనుమానం వచ్చిన వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930కు లేదా, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూర్యనారాయణరెడ్డి సూచించారు.

### శక్తి యాప్‌పై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పెరుగుతున్న మోసాలపై నిరంతరం అప్రమత్తతతో ఉండాలని స్థానిక సీఐ వీరయ్యగౌడ్ సూచించారు. మండల ప్రజా పరిషత్ ఆవరణలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న వారికి సైబర్ నేరాలు, శక్తి యాప్ వినియోగంపై బుధవారం అవగాహన కలిగించారు. సెల్‌ఫోన్ల వినియోగం అవసరం మేరకు ఉండాలని, ఏపీకే ఫైల్స్ వంటివి ఓపెన్ చేయడం ఏవిధంగా ప్రమాదాలకు తావిస్తుందో వివరించారు. అలాగే ఆకతాయిల వికృత చేష్టల నుంచి ఏవిధంగా కాపాడుకోవాలో అవగాహన కలిగించారు. ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ వినియోగాన్ని కూడా వివరించారు. ఈ సమయంలో కొంతమంది ట్రైనీలు వెలిబుచ్చిన సందేహాలను నివృత్తి చేశారు.

### ప్రభుత్వ పథకాల అమలుపై తనిఖీ

బిక్కవోలు: రంగాపురంలో కేంద్ర బృందం ప్రభుత్వ పథకాల అమలుపై తనిఖీ చేసింది. బుధవారం నేషనల్ లెవిల్ మోనిటరింగ్ బృంద సభ్యులు నాగరాజు, వినోద్‌లు కేంద్రం అమలు చేస్తున్న ప్రతి పథకం అమలు తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తడవని మడి.. రైతన్న కంటతడి

- ఖరీఫ్‌కు తప్పని నీటి కష్టాలు
- పాలకుల ముందుచూపు లేక ఎండిపోతున్న ఆకుమడులు
- నిరాశలో అన్నదాతలు
- ఆలస్యంగా పుష్కర నీటి విడుదల



ఆకుమడులు తడపడానికి నీటిని వదులుతున్న ట్యాంకర్



పుష్కర పిల్ల కాలువ నుంచి ఇంజిన్ సాయంతో తోడుతున్న నీరు

కోరుకొండ: మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో ఖరీఫ్ సాగుకు నీటి కష్టాలు మొదలయ్యాయి. కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో వర్షాధారమైన భూములెక్కువ. ఈ ఏడాది రుతుపవనాలు ముందే వస్తాయన్న కబురుతో రైతులు సంతోషంగా సాగుకు ఉపక్రమించారు. దానిలో భాగంగా ఆకుమడులు వేశారు. కానీ ఆశించిన స్థాయిలో వర్షాలు పడక, సాగునీరు అందక ఆకుమడులు ఎండిపోయే స్థితిలో ఉన్నాయి.

నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 16,152 హెక్టార్లు ఉంది. దీనిలో 60 శాతం భూమి వర్షాధారంగానే సాగవుతోంది. నాట్లు వేసింది కేవలం 3,046 హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి కృషి ఫలితంగా ఏర్పాటైన పుష్కర కాలువ ఆధారంగా సాగు జరుగుతోంది. పుష్కర కాలువలోని అన్ని పంపులు సక్రమంగా పని చేయకపోవడంతో నీటిని పంపింగ్ చేయడంలో సాంకేతిక సమస్యలున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందించాల్సిన బాధ్యతను విస్మరించడం రైతన్నలకు సాగులో కష్టాలను తెచ్చిపెట్టింది. సాగునీరు పుష్కలంగా అందించడానికి ప్రజాప్రతినిధులు కృషి చేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఎండిపోతున్న ఆకుమడులు**

నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో ఆకుమడులు ఎండిపోతున్నాయి. సక్రమంగా సాగునీరు అందకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. జూలై తొలి వారంలో వేసిన ఆకుమడులు నీరందక ఎండిపోతున్నాయి. బోర్లు, ఇతర నీటి వనరులున్న ప్రాంతాల్లో మాత్రమే వరినాట్లు పడ్డాయి. కోరుకొండ మండలంలో మెట్ట భూభాగం అత్యధికంగా ఉంది. ఇక్కడ 5,755 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా, నాట్లు కేవలం 230 హెక్టార్లలో మాత్రమే వేశారు. ఆకుమడులకు ఎకరం విస్తీర్ణానికి రూ.4,500 పెట్టుబడి ఖర్చవుతుంది. అయితే పెట్టుబడి దక్కుతుందా అని రైతన్నలు అయోమయంలో ఉన్నారు. అలాగే రాజానగరం, సీతానగరం మండలాల్లోని అత్యధిక భూభాగంలో సాగు ఆకుమడి దశలోనే ఉంది.

**విత్తనాలివీ..**

ఖరీఫ్ సీజన్‌లో బీపీటీ 5204, పీఎల్ఏ 1100, ఎంటీయూ 1064, 1061, ఎంటీయూ 1318 రకాలను సాగు చేసేందుకు రైతన్నలు సన్నద్ధమయ్యారు. నేల స్వభావం, భూసార పరీక్షల ఆధారంగా సాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

**అందని భరోసా**

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగమైన అన్నదాత సుఖీభవ పథకం అమలుకు నోచుకోలేదు. దీంతో రైతులు ఆర్థిక భరోసా అందని ద్రాక్షగానే ఉంది. వడ్డీకి అప్పులు చేసి సాగు చేయడానికి సిద్ధమయ్యారు. దానిలో భాగంగానే వేసవి దుక్కులనంతరం ఆకుమడులు వేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం మే నెలలోనే అందడంతో సాగులో ముందున్నారు. కూటమి ప్రభుత్వంలో అప్పుల బారిన పడాల్సి వచ్చిందని రైతులు మండిపడుతున్నారు.

**పురుషోత్తపట్నం ద్వారానే నీరు**

పుష్కర ఎత్తిపోతల పథకం పని చేయకపోవడంతో, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు సరఫరా జరుగుతోంది. దీని ద్వారా 700 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. జూన్ నెలలో విడుదల కావాల్సిన సాగు నీరు ఆలస్యంగా జూలై రెండో వారంలో విడుదలైంది. దీంతో ఆకుమడులకు నీరందని స్థితి నెలకొంది. కాలువలోని పూడికల తొలగింపు, నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చేయాల్సిన పనులను ముందస్తుగా నిర్వహించలేదు. కోరుకొండ మండలం దోసకాయలపల్లిలోని జగ్గప్పచెరువు, జంభూపట్నం, గాదరాడ, నర్సాపురం, కణుపూరు, నిడిగట్ల తదితర గ్రామాల్లోని చెరువులకు నీరు చేరలేదు. దీంతో గాదరాడ, ఇతర ప్రాంతాల్లోని 2,500 ఎకరాల విస్తీర్ణంలో ఆకుమడులు ఎండిపోతున్నాయి.

### ముందుచూపు లేకపోవడంతో..



పుష్కర కాలువ సాగునీటిని విడుదల చేయాలి. ఖరీఫ్ సాగుకు సాగునీటి గండం ఏర్పడింది. సాగు నీరందక కోరుకొండ మండలంలోని 2,500 ఎకరాల విస్తీర్ణంలో ఆకుమడులు ఎండిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి రాదేమో అనే భయాందోళనలో ఉన్నాం. కూటమి ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. గాదరాడ, నర్సాపురం, ఎస్.అగ్రహారం, జంభూపట్నం, దోసకాయలపల్లి, బూరుగుపూడి, నందరాడ తదితర గ్రామాల్లోని 2,500 ఎకరాలవిస్తీర్ణంలో ఆకుమడులు ఎండిపోతున్నాయి. రైతులు వాటర్ ట్యాంకుల ద్వారా పొలాలు తడుపుకొంటున్నారు.

– తోరాట శ్రీను, రైతు, గాదరాడ

### ట్యాంకర్‌కు రూ.రెండు వేల ఖర్చు



ఎండిపోయే దశలో ఉన్న ఆకుమడులను వాటర్ ట్యాంకర్లు, ఇంజిన్ల ద్వారా తడుపుకోవడం జరుగుతోంది. దీనికి ఎకరానికి రూ.2,000 చొప్పున ఖర్చవుతోంది. ఎన్ని ఎకరాలుంటే అంత ఖర్చు పెరుగుతోంది. దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం సాగునీటిని విడుదల చేయాలి. పుష్కర కాలువలోని నీటిని తోడుకునే రైతులకు ఇంజిన్లు సప్లై చేస్తే మంచిది.

– దొరబాబు, రైతు, బూరుగుపూడి

### నీరు విడుదల చేశాం

పుష్కర కాలువకు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు విడుదల చేశాం. పోలవరం పనుల కారణంగా పుష్కర కాలువ నిర్వహణను ఆపాం. పురుషోత్తపట్నంలో 10 పంపులున్నాయి. కాగా రెండు పంపుల ద్వారా 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశాం. దీని ద్వారా 1,45,000 ఎకరాల విస్తీర్ణానికి నీరందుతోంది.

– పీవీఎస్ఎస్ రంగారావు, ఈఈ, పుష్కర ఎత్తిపోతల పథకం

### చినుకు కోసం ఎదురుచూపులు



వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

సీతానగరం: వర్షాలు లేకపోవడంతో మండలంలోని పొలాల్లో వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. వరి సాగు మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో జరుగుతుంది. తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్ పరిధిలో 14 వేల ఎకరాలు ఉంది. మిగిలిన భూములు వర్షాధారంపైనే ఆధారపడి ఉన్నాయి. వరినాట్లు వేసేందుకు వర్షాలు లేక రైతులు అయోమయంలో పడ్డారు. రెండు వారాలుగా వర్షాలు లేకపోవడంతో మోటార్లకు అందుబాటులో ఉన్న భూముల్లో మాత్రమే వరినాట్లు వేస్తున్నారు. పొలాల్లో మోటార్ల నీరు, టీపీ స్కీమ్, కాటవరం స్కీమ్ నుంచి వచ్చే సాగు నీటితో ఆయా ప్రాంతాల్లో దమ్ములు చేస్తున్నారు.

**నత్తనడకన దమ్ములు**

సాధారణంగా జూలైలో వర్షాలు కురవాల్సి ఉంది. అలాకాకుండా జూన్‌లో కురిసిన వర్షాలు రైతులకు ఉపయోగపడలేదు. ఇప్పుడు వాతావరణంలో సంభవించిన మార్పులతో ఎండలు విపరీతంగా కాస్తుండటంతో పొలాల్లో దమ్ములు నత్తనడకన సాగుతున్నాయి. టీపీ స్కీమ్, కాటవరం ఎత్తిపోతల పథకం నుంచి విడుదల చేసే సాగునీటికి, వర్షాల నీరు తోడైతే వేగవంతంగా వరి నాట్లు పడే అవకాశం ఉంది. మోటార్లు అందుబాటులో ఉన్న పొలాల్లోనూ, జూన్‌లో కురిసిన వర్షాలకు ఆకుమడులు వేయడంతో, ప్రస్తుతం వరినారు సిద్ధంగా ఉంది. వర్షాలు లేకపోవడంతో మండలంలో ప్రస్తుతం వరి నాట్లు మందకొడిగా సాగుతున్నాయి. వాన పడితే కానీ వరినాట్లు జోరందుకోని పరిస్థితి నెలకొంది.

### మాజీ ఎమ్మెల్యే అమ్మిరెడ్డికి నివాళి

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి 39వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పడాల వెంకటరామారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ద్వారంపూడి వెంకటరెడ్డి, మల్లిడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: స్థానిక జీబీఆర్ కళాశాలలో విద్యాదాత పడాల అమ్మిరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన విగ్రహానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌తోపాటు అమ్మిరెడ్డి కుమారుడు, మనుమడు పడాల వెంకటరామారెడ్డి, అభిరామ్‌రెడ్డి, జెడ్పీ మాజీ ప్రతిపక్షనేత సత్తి రామారెడ్డి, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేశారు. నీటి సంఘం అధ్యక్షుడు టి.సుధాకరరెడ్డి, జీబీఆర్ విద్యాసంస్థల డైరెక్టర్లు బి.రత్నారెడ్డి, జి.జగన్నాథరెడ్డి, ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ అబ్బాయిరెడ్డి పాల్గొన్నారు.

### నారసింహునికి పూర్వ వైభవం తేవాలి

కోరుకొండ: లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వైభవాన్ని కాపాడాలని పలువురు ఎమ్మెల్యే బలరామకృష్ణను కోరారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ఆయన కార్యాలయంలో కలిసిన భక్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే ముందుంచారు. స్వామివారి గోపురాన్ని రాత్రివేళ దర్శించుకునే భాగ్యాన్ని పునరుద్ధరించాలన్నారు. చీకటిమయం కావడంతో స్వామివారి దర్శనం కావడం లేదన్నారు. స్వామివారి సేవాకాలంలో నిర్వహించే శ్రీవైష్ణవ ప్రబంధం వినే సదుపాయాన్ని కల్పించాలన్నారు. అన్న సమారాధన భక్తులందరికీ అందేలా చూడాలన్నారు. దేవస్థానం గుమస్తాను ఆయా విషయాలపై వివరణ కోరితే, నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అన్నవరం దేవస్థానం ఈఓకు ఫోన్‌లో సమస్యలను తెలిపి పరిష్కరించాలని ఎమ్మెల్యే తెలిపారు.

## ఇంటర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాజానగరం: నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో విద్యాపరంగా ఉన్న లోటును భర్తీ చేస్తూ ఇంటర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌పై వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. దివాన్‌చెరువులో జూనియర్ కళాశాల, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను తీసుకువస్తామన్నారు. నియోజకవర్గాన్ని టెంపుల్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. గాదరాడలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయడంతో పాటు, బూరుగుపూడిలో వంద పడకల ఆసుపత్రి, డిజిటల్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. తాగునీటి అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చే విధంగా రూ.2,500 కోట్ల వ్యయంతో అవసరమైన ప్రణాళికలను అందజేశామన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కలవచర్లలో రూ.104 కోట్లతో ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందుకు అనుగుణంగా రూ.120 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### జెడ్పీ హైస్కూల్ పరిశీలన

సీతానగరం: మండలంలో రఘుదేవపురం గ్రామంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను రాష్ట్ర స్థాయి పరిశీలకుడు, సిమాట్ నుంచి వచ్చిన ప్రొఫెసర్ ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. ఈ హైస్కూల్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌గా ఎంపికైన సందర్భంగా ఆయన పరిశీలనకు వచ్చారు. పాఠశాల్లోని వసతులు, విద్యార్థుల అచీవ్‌మెంట్స్‌ను తనిఖీ చేశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్లేగ్రౌండ్, పీఎంశ్రీ నిధులతో అభివృద్ధి చేసిన ఆటస్థలం, ర్యాంపు, ఇంకుడు గుంటలు, కిచెన్ గార్డెన్ ఫెన్సింగ్ నిర్మాణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన ల్యాబ్‌ల ఏర్పాటుకు కావలసిన అదనపు తరగతి గదులకు తలుపులు, కిటికీలు పెట్టించడానికి ఇప్పటికే సర్వశిక్షాభియాన్ ఏపీసీ అనుమతి పొంది ఉన్నాయని హెచ్ఎం ఎం.శ్యామలాదేవి ఆయనకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.స్వామినాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

సీతానగరం: మండలంలోని కొన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముగ్గళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ముగ్గళ్ల హెడ్ క్వార్టర్ ఫీడర్‌లో చెట్ల తొలగింపు, లైన్ మేంటినెన్సు కారణంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగ్గళ్ల, ఇనుగంటివారి పేట, రఘుదేవపురం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుందని పేర్కొన్నారు.

పెదపూడి: గొల్లల మామిడాడ విద్యుత్ ఉప కేంద్రంలో వివిధ పనుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విద్యుత్తు అంతరాయం కలుగుతుందని, దీనికి వినియోగదారులు సహకరించాలని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉదయభాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గొల్లల మామిడాడ, గండ్రేడు, పైన, రాజుపాలెం, వేండ్ర, పెద్దాడ, కుమారప్రియం, కై కవోలు తదితర గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉదయభాస్కర్ కోరారు.

అనపర్తి: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల నిమిత్తం శుక్రవారం అనపర్తిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీబీజే నటరాజన్ తెలిపారు. దుప్పలపూడి సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ రైల్వే స్టేషన్ ఫీడర్, అలాగే అనపోతవరం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ ధరణికోట ఫీడర్, సావరం 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. స్థానిక ఇందిరా నగర్, జీబీఆర్ కాలేజీ ఏరియా, సునందపేట, రైల్వే స్టేషన్ ఏరియా, ధరణికోట, పాత ఊరు సీడీఆర్ ఆసుపత్రి రోడ్డు, సావరం, మహాలక్ష్మీపేట ప్రాంతాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

**రెండు రోజులు పవర్ కట్**

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రెండు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. 11 కేవీ ఫీడర్లపై వార్షిక పరమైన మరమ్మతులలో అగ్రికల్చర్ ఫీడర్‌పై గురువారం, ఇండస్ట్రీయల్ ఫీడర్‌పై శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ బుధవారం తెలిపారు. అలాగే ద్వారపూడి 33 కేవీ ఆర్‌వీకే ఫీడర్‌పై కూడా మరమ్మతులు చేయడంతో శుక్రవారం ఈ సమయంలోనే విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ కారణంగా రెండు రోజులు శ్రీకృష్ణపట్నం, భూపాలపట్నం, పాతతుంగపాడులోను, శుక్రవారం కొత్త తుంగపాడు, జి.యర్రంపాలెం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

# మూణ్ణాళ్ల ముచ్చట

- జాతీయ రహదారిపై అడుగడుగునా గోతులు
- తూతూమంత్రంగా మరమ్మతులు
- రోజుల వ్యవధిలోనే మళ్లీ అధ్వానం
- ప్రయాణికులకు తీవ్ర అవస్థలు



హైవేపై దివాన్‌చెరువు వద్ద పడిన గోతులు

రాజానగరం: పేరుకే జాతీయ రహదారి. ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఇదీ 16వ నంబర్ జాతీయ రహదారి దుస్థితి. చేసిన పనుల్లో నాణ్యత లోపంతో పాటు, వర్షాల ప్రభావంతో జాతీయ రహదారిపై అనేక చోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారిపై ప్రయాణమంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. అడుగడుగునా గోతులు పడటంతో.. రయ్ రయ్ మంటూ ప్రయాణించే వాహనాలు ఢబేల్ మంటూ వాటిలో పడుతూ వాహనదారులను వణికిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రహదారిపై తారు, కంకర మిశ్రమాన్ని పొరలుగా పోస్తూ, రహదారికి అధికారులు మెరుగులు దిద్దుతున్నారు. ఈ పనుల్లో నాణ్యత లోపించడంతో.. తాత్కాలిక మెరుగులు వర్షాలకు కొట్టుకుపోయి, కొద్దిరోజుల్లోనే మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి.

**జేబుకు చిల్లు**

జాతీయ రహదారిపై వేగానికి నియంత్రణ లేకపోవడంతో బైకులు, కార్లు, లారీలు ఇలా ప్రతి వాహనం వేగంగా దూసుకుపోతుంటాయి. వర్షాల కారణంగా రహదారిపై పడిన గోతులను దగ్గరకు వచ్చే వరకు గమనించే అవకాశం లేకపోవడంతో.. ఆయా వాహనాలు వాటిలో పడుతూ పెద్ద శబ్దాన్ని చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వాహనదారుల గుండెలు గుభేల్ మనడమే కాకుండా, ఆయా వాహనాల జంపర్లు, ఇతర పరికరాలు మరమ్మతులకు గురికావడంతో జేబులు ఖాళీ అవుతున్నాయి. ఒక్కోసారి ప్రమాదాలకు కూడా దారితీసి, వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు.

### నాణ్యత లోపమే ప్రధాన కారణం

సాధారణంగా రహదారుల అభివృద్ధి, మరమ్మతు పనులను వేసవిలో చేస్తుంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16వ నంబర్ జాతీయ రహదారి రావులపాలెం నుంచి తుని వరకు సుమారు 130 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ రహదారిని పర్యవేక్షిస్తూ, మరమ్మతులు చేసే బాధ్యతను వివిధ కంపెనీలు తీసుకున్నాయి. కాలానుగుణంగా ఆయా కంపెనీలు రహదారి మరమ్మతులతో పాటు, డివైడర్లపై నాటిన మొక్కల పెంపకానికి కూడా బాధ్యత తీసుకోవలసి ఉంటుంది. ఈ పనులు తూతూమంత్రంగా చేపట్టడంతోనే సమస్యలు వస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. టోల్ గేట్ ఫీజుల పేరుతో వాహనదారుల నుంచి భారీగా సొమ్ములు వసూళ్లు చేస్తున్న పాలకులు.. రహదారుల నిర్వహణను బాధ్యతాయుతంగా నిర్వర్తించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేసవిలో చేపట్టవలసిన మరమ్మతులను వర్షాలు కురిసే సమయంలో తూతూమంత్రంగా చేపట్టడంతో ఆ పనులలో నాణ్యత లోపించి, చేసిన పనులు ఎక్కువ రోజులు మన్నడం లేదని నిపుణులు అంటున్నారు. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు పడటమే కాకుండా, ప్రజాధనం కూడా వృథా అవుతుందని ప్రజలు వాపోతున్నారు.

### సేవలతో మంచి గుర్తింపు



ఉద్యోగులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

బిక్కవోలు: సేవలతో మంచి గుర్తింపు సాధించారని జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి అన్నారు. బుధవారం మండలంలోని కొంకుదురులో సచివాలయం-1, 2లో పనిచేసి బదిలీపై వెళుతున్న ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మావతి, సర్పంచ్ సత్తి వీరమణి మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ హయాంలో ఉద్యోగం సాధించారన్నారు. అప్పటి నుంచి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమాలకు కృషి చేశారన్నారు. సచివాలయం-1 నుంచి పెనుగంటి వీరఫణి శివనాగేశ్వరరావు, నాళం సాయిప్రసాద్, కొండేలు తాతయ్యలు, సచివాలయం-2 నుంచి సైనం శ్యామల, గిద్ది సుధారాణి, గెద్దం పద్మ, దోకు బుర్రరాజు, రొక్కల ఉమామహేశ్వరి, మాచాగిరి దుర్గాప్రసాద్‌రావు బదిలీపై వెళుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, కొంకుదురు నీటి సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యురాలు కొవ్వూరి కాశీ అన్నపూర్ణ, కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

బిక్కవోలు: మండలంలోని నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలని తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని రూ.1.06 కోట్లు వసూలు చేయాలన్నారు. ఇప్పటికి రూ.50.88 లక్షలు వసూలు చేశామని, ఇంకా రూ.55.56 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. అత్యధికంగా బిక్కవోలులో రూ.15.82 లక్షలు, పందలపాకలో రూ.9.71 లక్షలు ఊలపల్లిలో రూ.8.32 లక్షలు, కొంకుదురు రూ.5.21 లక్షలు కొమరిపాలెంలో రూ.4.49 లక్షలు వసూలు చేయాలన్నారు. ఈ ఐదు గ్రామాల్లో 80 శాతం వసూలు రావాల్సి ఉందన్నారు. అలాగే రైతులు కూడా వసూలుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి



పెద్దాడలో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీపీఓ రవికుమార్

పెదపూడి: గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా క్లాప్ మిత్రలు సేకరించాలని డీపీఓ రవికుమార్ అన్నారు. మండలంలోని రామేశ్వరం, పెద్దాడ గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలు తడి, పొడి చెత్తను ఏ విధంగా సేకరిస్తున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపరచాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని అన్నారు. దీనికి సంబంధించి సచివాలయ కార్యదర్శులు, సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి విధులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ మన్యం శ్రీనివాస్ చౌదరి, సచివాలయ కార్యదర్శులు భోగరాజు ప్రసన్నాంజనేయులు, ఎస్.కనకనాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



పైన గ్రామంలో మాట్లాడుతున్న ఏఓ సత్యప్రసాద్

పెదపూడి: పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ రైతులకు సూచించారు. పైన గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన ఎరువుల వినియోగంతో నేలలో సారం పెరుగుతుందని, తద్వారా నాణ్యమైన, ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. గ్రామంలో వెదజల్లు సాగు పొలాలను పరిశీలించి సాగుకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం రైతులకు జీవన ఎరువులు, కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఉద్యాన శాఖాధికారి శైలజ మాట్లాడుతూ బోరు ద్వారా సాగు చేసే భూముల్లో ఆయిల్‌పామ్ సాగు చేయడం శ్రేయస్కరమని సూచించారు. కార్యక్రమంలో వీఏఓ లిఖిత తదితరులు పాల్గొన్నారు.